క్లుప్తంగా

రామాలయ నిర్మాణానికి నిధుల మంజూరు



ఆలయ నిర్మాణం కోసం మంజూరైన నిధుల చెక్కును పెద్దలకు అందిస్తున్న చెల్లుబోయిన నరేన్

కె.గంగవరం: మండలంలోని బాలాంత్రంలోని గోపాలరావుపేటలో నూతన రామాలయం నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ఆలయ నిర్మాణానికి మంజూరైన రూ.10 లక్షల చెక్కును శనివారం గోపాలరావుపేట పెద్దలకు మంత్రి చెల్లుబోయిన వేణు తనయుడు చెల్లుబోయిన నరేన్ అందించారు. ఆయన మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి మొదటి విడతగా రూ.3 లక్షల 28 వేలు అందుతాయని మిగిలినవి నిర్మాణ దశలను బట్టి అందుతాయన్నారు. గ్రామ పెద్దలు మంత్రి చెల్లుబోయిన వేణుకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీటీసీ కోట సత్తిబాబు, యర్రపోతవరం సర్పంచ్ పిల్లి రాంబాబు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో ద్వితీయ స్థానం



ద్వితీయ స్థానం పొందిన మణిశేఖర్

రామచంద్రపురం: తిరుపతిలో జరిగిన ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కూల్ చెస్ టోర్నమెంట్ అండర్-14 చెస్ పోటీల్లో దంగేటి గిరి మణిశేఖర్ ద్వితీయ స్థానం సాధించాడు. రాష్ట్ర స్థాయిలో ద్వితీయ సాధించిన మణిశేఖర్‌ను మోడరన్ విద్యాసంస్థల అధ్యాపకులు, తోటి విద్యార్థులు అభినందించారు.

తక్షణ సాయం అందజేత



బీమా సొమ్ము అందజేస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ తదితరులు

కపిలేశ్వరపురం: మండలంలోని కేదారిలంకలో ఇటీవల అనారోగ్యంతో చనిపోయిన బూల ఆనందరావు కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా మంజూరైంది. తక్షణ సాయంగా రూ.10 వేలను శనివారం సర్పంచ్ వీది వెంకటరెడ్డి, ఎంపీటీసీ యర్రంశెట్టి నాగేశ్వరరావు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు యర్రంశెట్టి సత్తిబాబు, యర్రంశెట్టి నాగు, వీధి శ్రీను, వీధి రాజు, కోనాల బుజ్జి, మద్దింశెట్టి ధనరాజు పాల్గొన్నారు.

రైల్వే బోర్డు కన్సల్టేటివ్ కమిటీ మెంబర్‌గా రాంబాబు



పెయ్యల రాంబాబు

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెలంపాలెంకు చెందిన పెయ్యల రాంబాబు దక్షిణ మధ్య రైల్వే బోర్డు స్టేషన్ కన్సలేటివ్ కమిటీ మెంబర్‌గా నియామకం పొందినట్టు శనివారం విలేకరులకు తెలిపారు. ఈమేరకు దక్షిణ మధ్య రైల్వే అసిస్టెంట్ కమిషనర్ సంజయ్ మనోజ్ నుంచి ఉత్తర్వులు అందాయన్నారు. రాంబాబు తన నియామకానికి సహకరించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీవేమ, జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, కర్రి చిట్టిబాబు తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

వైఎస్సార్ సీపీలోకి శెట్టిబలిజ సామాజిక వర్గీయులు



వైఎస్సార్ సీపీలోకి చేరుతున్న అంగరకు చెందిన శెట్టిబలిజ సామాజిక వర్గీయులు

కపిలేశ్వరపురం: అంగర గ్రామానికి చెందిన పలువురు శెట్టిబలిజ సామాజిక వర్గీయులు శనివారం వైఎస్సార్ సీపీలోకి చేరారు. మండపేటలోని ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో తోట త్రిమూర్తులు సమక్షంలో వారు పార్టీలో చేరారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపడుతున్న సంక్షేమ పథకాలు, నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చూపుతున్న చొరవకు స్పందించి పార్టీలో చేరుతున్నట్టు వారు తెలిపారు. వారిని ఎమ్మెల్సీ తోట సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో అంగర-2 ఎంపీటీసీ మేడిశెట్టి దుర్గారావు, మండల శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు వాసంశెట్టి వాసు పాల్గొన్నారు.

అవిశ్రాంత బాటసారులు

- ఉద్యోగాన్ని విరమించినా సేవా కార్యక్రమాల్లో ముందుకు..
- విశ్రాంత ఉద్యోగుల నిర్మాణాత్మక కృషి
- రెండు నియోజకవర్గాల్లో 3,020 మంది
- నేడు పెన్షనర్స్ డే



రామచంద్రపురంలో రిటైర్డ్ ఉద్యోగులను సత్కరిస్తున్న రిటైర్డ్ పెన్షనర్ల సంఘ నాయకులు (ఫైల్)

కపిలేశ్వరపురం: ఉద్యోగం సామాజికం. వ్యక్తిగతమైన జీవితాన్ని త్యాగం చేస్తూ తన రోజువారీ జీవితంలో అధిక సమయాన్ని ఉద్యోగ ధర్మం కోసం కేటాయించాల్సి వస్తుంది. ఉద్యోగ విరమణ వయస్సు వచ్చే వరకూ దీర్ఘకాలం పాటు ఉద్యోగ ధర్మాన్ని పాటిస్తూ జీవించాలి. మారుతున్న సామాజిక విలువల నేపథ్యంలో ఉద్యోగి అవసరాలు, కుటుంబ అవసరాలు పెరుగుతూనే ఉంటాయి. ఇక ఉద్యగ విరమణ తర్వాత జీవితం సమస్యలమయమే. అలాంటి నేపథ్యంలో విశ్రాంత ఉద్యోగులు సాయమందించడం రిటైర్డ్ ఉద్యోగులకు ఉపశమనం కలుగుతుంది. నేడు పెన్షనర్స్ డే సందర్భంగా ఈ కథనం.

రెండు నియోజకవర్గాల్లో ఇలా..

మండపేట నియోజకవర్గంలోని మండపేట, రాయవరం మండలాల్లో రిటైర్డ్ పెన్షనర్ల సంఘాలున్నాయి. మండపేటలో 700 మంది, కపిలేశ్వరపురం మండలంలో 800 మంది మొత్తం 1,500 మంది ఉన్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలో 1,520 మంది ఉన్నారు. రామచంద్రపురం, రాయవరంల్లో సంఘాలకు సొంత భవనాలు ఏర్పాటు చేసుకుని, సామాజిక సేవా కార్యక్రమాలను చేపడుతున్నారు.

సేవా కార్యక్రమాల్లో..

ఉద్యోగి తన సర్వీసును పూర్తి చేసుకుని ఉద్యోగ విరమణ చేసన తర్వాత తన తాలూకు లావాదేవీలపై పూర్తి అవగాహన ఉండదు. దీంతో విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్‌ను ఆశ్రయిస్తుంటారు. వారి విజ్ఞప్తిపై అసోసియేషన్ నాయకులు సాయం చేస్తుంటారు. రిటైర్డ్ ఉద్యోగి మెడికల్ రీయింబర్స్‌మెంట్, పింఛను పే ఫిక్షేషన్‌లో వ్యత్యాసాలుంటే సరి చేయించడం, వ్యక్తిగత సర్టిఫికెట్లు సమకూర్చడం, ఏటా జీవన ప్రమాణ పత్రాలను సమర్పించడంలో సాయమందిస్తుంటారు.

సాధారణ కార్యక్రమాల్లోనూ ముందుకు

రిటైర్డ్ ఉద్యోగులతో పాటు సాధారణ సేవా కార్యక్రమాలను సైతం చేస్తున్నారు. విశ్రాంత ఉద్యోగులతో పాటు సాధారణ ప్రజలకు సైతం ఉచితంగా నేత్ర వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నారు. రామచంద్రపురం, మండపేట అసోసియేషన్లు ఏడాది పొడవును పలు కార్యక్రమాలను చేస్తున్నారు. పెన్షనర్స్ డే రోజైన డిసెంబర్ 17న సుమారు 50 మంది చొప్పున సత్కారం చేస్తున్నారు. రామచంద్రపురంలో టీచర్స్ డే రోజున ఉపాధ్యాయులను సత్కరిస్తున్నారు. స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాలను నిర్వహిస్తున్నారు. కార్తిక వన భోజనాలను నిర్వహిస్తూ ఐక్యతను చాటుతున్నారు. మండపేట రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో 75 ఏళ్లు నిండిన రిటైర్డ్ ఉద్యోగులకు సత్కారం చేస్తున్నారు.

పెన్షనర్స్ డే నేపథ్యమిదీ..

బ్రిటిష్ కాలంలో ఉద్యోగికి సంపూర్ణమైన హక్కులు పెద్దగా ఉండేవి కావు. వ్యవసాయం గౌరవప్రదమైనదిగా భావించడంతో ఉద్యోగావకాశం వచ్చినా, ఆనాటి చదువరులు ఉద్యోగంలో చేరేవారు కాదు. పరిమితంగా ఉండటంతో వారిలో ఐక్యత కూడా అత్యల్పంగానే ఉండేది. ఆ నేపథ్యంలో ఉద్యోగ విరమణ చేసిన తర్వాత పెన్షన్ అనేది అత్యల్పంగా ఉండేది. 1889లో పెన్షన్ విధానం ప్రారంభమైనప్పటికీ, అది కేవలం నామమాత్రంగా ఉండేది. 1920 బ్రిటిష్ కాలంలో రిటైర్డ్ బెనిఫిట్ పెన్షన్ ప్రవేశపెట్టారు. ఢిల్లీ మిలటరీ అధికారి డీఎస్ నకారా పెన్షన్ కోసం పోరాటాన్ని దశలువారీగా చేశారు. పెన్షన్ సానుభూతిలో ఇచ్చేది కాదని, అది రాజ్యాంగబద్ధమైన హక్కుగా గుర్తించాలంటూ న్యాయపోరాటం చేశారు. 1980 దశాబ్దాల్లో పలు పోరాటాలు చేయడంతో ఏపీ రివైజ్డ్ పెన్షన్ రూల్స్-1980 అమల్లోకి వచ్చాయి. 1981లో కుటుంబ పెన్షన్ అమల్లోకి వచ్చింది. అంతిమంగా 1982 డిసెంబర్ 17న అప్పటి సుప్రీం కోర్టు న్యాయమూర్తి వైవీ చంద్రచూడ్ తీర్పు చెప్పారు. ఆనాటి నుంచి జాతీయ స్థాయిలో పెన్షనర్స్ డే మొదలైంది. ఆ తీర్పు ఇచ్చిన వైవీ చంద్రచూడ్ ప్రస్తుత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధనంజయ యశ్వంత్ చంద్రచూడ్ తండ్రి. పెన్షన్ హక్కు కోసం పోరాడిన డీఎస్ నకారా 2009లో కన్నుమూశారు. ఆయనకు నివాళిగా విశ్రాంత ఉద్యోగ సంఘాలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

సామాజిక బాధ్యతతో..



"రామచంద్రపురం సమీపంలోని రిటైర్డ్ ఉద్యోగులు సామాజిక బాధ్యతతో ముందుకు సాగుతున్నారు. రోజురోజుకూ మారుతున్న పెన్షన్ రూల్స్‌ను అధ్యయనం చేస్తూ, ఉద్యోగ విరమణ చేస్తున్న వారికి వారి ప్రయోజనాల కోసం సూచనలు సలహాలను ఇస్తున్నాం. వాటితో పాటు వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నాం.

– పట్నాల రామకృష్ణారావు, అధ్యక్షుడు, రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్, రామచంద్రపురం

రిటైర్డ్ ఉద్యోగుల సేవలో..



దీర్ఘకాలం పాటు ఉద్యోగంలో కొనసాగిన ఉద్యోగికి విరమణ రోజు వచ్చినప్పుడు బాధగా ఉంటుంది. ప్రజా సేవలో నిమగ్నమైన వ్యక్తి ఒక్కసారిగా పనిచేసిన సంస్థ నుంచి దూరంకావాల్సి రావడం మానసిక బాధకు దారితీస్తుంది. అలాంటి వ్యక్తికి, కుటుంబానికి భరోసా ఇవ్వాల్సిన అవసరం ఉంది. అసోసియేషన్ తరఫున రిటైర్డ్ ఉద్యోగి ప్రయోజనాలన్నీ సకాలం వచ్చేలా సహకరిస్తున్నాం.

– దేవళ్ల సత్యనారాయణ, అధ్యక్షుడు, రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్, మండపేట"

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

సాక్షి ఇంపాక్ట్

కె.గంగవరం: మండలంలోని అద్దంపల్లి శివారు వట్రపూడిలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని శీర్షక ఈ నెల 16న 'సాక్షి'లో ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు శనివారం తరచుగా మరమ్మతులకు గురవుతున్న ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి ఆ స్థానంలో మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. గత కొన్ని నెలలుగా ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురికావడంతో ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులకు మరో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడంతో వారు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

కుమ్మరి సావరం వద్ద దిగిపోతున్న ఏటిగట్టు రహదారి



కుమ్మరి సావరం వద్ద రోడ్డు కిందికి దిగిపోయిన దృశ్యం

కె.గంగవరం: మండలంలోని కోటిపల్లి కుమ్మరిసావరం వద్ద ఏటిగట్టు కిందికి దిగిపోయి ప్రమాదకరంగా మారింది. ఈ రహదారిలోపై వాహనాలు వచ్చేటప్పుడు దిగిపోయిన రోడ్డును గమనించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రయాణికులు చెబుతున్నారు. పెద్ద వాహనాలు వెళ్లేటప్పుడు ఈ ప్రమాదాలు మరింత పెరిగి మృత్యువాత పడే అవకాశాలు ఉన్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే రోడ్డును సరిచేయాలని గ్రామస్తులు, ప్రయాణికులు కోరుతున్నారు.

ఆ నేత్రాలు అజరామరం



చిట్టాల సత్తిరాజు (ఫైల్)

కాజులూరు: మండలంలోని కుయ్యేరుకు చెందిన చిట్టాల సత్తిరాజు(80) శుక్రవారం మృతి చెందారు. వీరి బంధువు తుమ్మూరి వెంకటరమణమూర్తి సూచన మేరకు భార్య అన్నపూర్ణ, కుమారులు నాగేశ్వరరావు, గణపతి, కామేశ్వరరావు, శ్రీనివాస్, రామకృష్ణలు నేత్రాలు దానం చేయడానికి అంగీకరించడంతో కాకినాడ బాదం బాలకృష్ణ ఐ బ్యాంకు ప్రతినిధులు గొర్రెల రవికుమార్, సూరంపూడి రామ్‌కుమార్‌లు అతని కార్నియాను సేకరించారు. ఇద్దరు అంధుల జీవితాల్లో వెలుగులు నింపే నిర్ణయం తీసుకున్న చిట్టాల సత్తిరాజు కుటుంబ సభ్యులను పలువురు అభినందించారు.

సుబ్రహ్మణ్య షష్ఠికి వేళాయెనె..

- ఈ నెల 18న స్వామివారి షష్ఠి తీర్థాలు
- నేటి రాత్రి వాడవాడలా వల్లీదేవసేనుడి కల్యాణాలు

రాయవరం: వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుడి షష్ఠి ఉత్సవాలకు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాలు ముస్తాబయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే షష్ఠి ఉత్సవాలకు ఆలయ కమిటీలు ఏర్పాట్లు చేస్తున్నాయి. శనివారం నుంచి ఆలయాల వద్ద సందడి నెలకొంది. మండలంలోని చారిత్రక శివాలయాలైన సోమేశ్వరంలోని బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి, వెంటూరులోని ఉమా సమేత సోమేశ్వరస్వామి, రాయవరంలోని పార్వతి సమేత రాజేశ్వరస్వామి, చెల్లూరులోని బాలాత్రిపుర సుందరీ సమేత అగస్తేశ్వరస్వామి, పసలపూడి, మాచవరం, వెదురుపాక గ్రామాల్లోని శివాలయాల్లో షష్ఠి ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.



వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

నేటి రాత్రి కల్యాణం

వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి ఉత్సవం సోమవారం నిర్వహించనున్న నేపథ్యంలో ఆదివారం రాత్రి స్వామివారి దివ్య కల్యాణాన్ని పలు ఆలయాల్లో శాస్త్రోక్తంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. గ్రామ పెద్దలే పెండ్లిపెద్దలుగా వ్యవహరించి కల్యాణాన్ని చేపట్టనున్నారు. సంతానం కలగని వారు, కుజ, కాలసర్ప దోషాలున్న వారు కల్యాణాన్ని చేయించినా, తిలకించినా దోషాలు పోతాయనేది భక్తుల విశ్వాసం. దీంతో కల్యాణాన్ని నిర్వహించాలని కోరుకునే వారితో పాటు, నవ దంపతులు పీటలపై కూర్చుని కల్యాణాన్ని జరిపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కల్యాణం అనంతరం భక్తులకు తలంబ్రాలు, తీర్థప్రసాదాలు అందజేస్తారు. క్లస్టర్ పరిధిలోని రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలోని మండపేట, రామచంద్రపురం, రాయవరం, కపిలేశ్వరపురం, కె.గంగవరం, కాజులూరు మండలాల్లోని వివిధ గ్రామాల్లో ఉన్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాలు, శివాలయాల్లో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణాలకు ఆలయ కమిటీలు, భక్తులు ఏర్పాట్లు చేస్తున్నారు.



అంగరలో స్వామి కల్యాణ ఆహ్వాన పత్రికలను పంపిణీ చేస్తున్న భక్తులు

కల్యాణ ఆహ్వాన పత్రికలు పంపిణీ

కపిలేశ్వరపురం: అంగరలోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ ఆహ్వాన పత్రికలను శనివారం భక్తులు పంపిణీ చేశారు. షష్ఠి ఉత్సవాల నిర్వహణ కమిటీ సభ్యులు, భక్తుల ఆధ్వర్యంలో డోలు, సన్నాయిలతో సంప్రదాయ దుస్తులను ధరించి, అంగర, పడమర ఖండ్రిక గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ఆహ్వాన పత్రికలను అందజేశారు. స్వామి కల్యాణాన్ని తిలకించేందుకు తగిన ఏర్పాట్లు చేసినట్టు ఆలయ నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు.

ఘనంగా స్త్రీల క్రిస్మస్ వేడుకలు

రామచంద్రపురం రూరల్: మండలంలోని వేగాయమ్మపేట పీటీఎస్ఎం చర్చి ఆవరణలో రెవరెండ్ జి.గ్రేస్ విక్టోరియా ఆధ్వర్యంలో శనివారం స్త్రీల క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రామచంద్రపురం మండల ఎంపీపీ అంబటి భవాని, అనపర్తి ఫెయిత్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ టి.షారోన్ రోజా, పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రి సివిల్ అసిస్టెంట్ సర్జన్ శారా విక్టోరియా, కాకినాడ డీపీఆర్ఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ బి.స్వరాజ్యకుమారి ఈ వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం కొవ్వొత్తులతో ఆరాధన నిర్వహించారు. పాటలు పాడి యేసుక్రీస్తును ఆరాధించారు. ప్రేమ విందును స్వీకరించారు. కార్యక్రమంలో టి.మైటీ జ్యువెల్, బి.కమలరత్నం, జి.రేణుక, వేగాయమ్మపేట, తోటపేట, గాంధీనగర్, కొత్తకోట తదిరత గ్రామాల నుంచి సుమారు 300 మంది మహిళా భక్తులు పాల్గొన్నారు.



వేగాయమ్మపేటలో క్రిస్మస్ వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ భవాని, గ్రేస్ విక్టోరియా తదితరులు

చేనేత కార్మికుల అభ్యున్నతికి పాటుపడాలి

బేతా వెంకటేశ్వరరావుకు ఎమ్మెల్సీ తోట అభినందనలు

కపిలేశ్వరపురం (మండపేట): చేనేత కార్మికుల అభ్యున్నతికి పాటుపడాలని వైఎస్సార్ సీపీ చేనేత విభాగం రాష్ట్ర కమిటీ సహాయ కార్యదర్శిగా నియమితులైన బేతా వెంకటేశ్వరరావుకు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చెప్పారు. ఏడిదకు చెందిన బేతా వెంకటేశ్వరరావు శనివారం మండపేటలోని ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో తోటను మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు రాష్ట్ర కమిటీలో స్థానం కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్సీ తోటకు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ భారతీయ నైపుణ్యతకు నిలువుటద్దంగా గుర్తింపు పొందిన చేనేత వృత్తి పరిరక్షణకు పాటుపడాలన్నారు. కార్మిక కుటుంబాలను ఆదుకునేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలపై చేనేత వర్గాల్లో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి మాట్లాడుతూ నియోజకవర్గంలో విస్తృతంగా ఉన్న చేనేత కుటుంబాల సమస్యలపై పనిచేయాలని వెంకటేశ్వరరావుకు సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పెంకే గంగాధర్, కౌన్సిల్ విప్ పోతంశెట్టి ప్రసాద్, షేక్ అండ్ షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ అలీఖాన్ బాబా, వ్యాపారవేత్త వెంకటేశ్వరావు, ఏఎంసీ డైరెక్టర్ ముగ్గళ్ల పార్థకృష్ణ, నాయకులు ఎస్.రాంబాబు, బి.కృష్ణ, పి.భద్రరావు, టి.సోమరాజు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.



బేతా వెంకటేశ్వరరావుకు అభినందనలు తెలుపుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర



మారేడుబాకలో మాట్లాడుతున్న సాయిరామ్

కపిలేశ్వరపురం (మండపేట): తాపేశ్వరపురం, మారేడుబాక గ్రామాల్లో శనివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర సమావేశాలను నిర్వహించారు. ఆయా గ్రామాల పంచాయతీ కార్యాలయాల్లో నిర్వహించిన కార్యక్రమంలో అధికారులు, బీజేపీ నాయకులు మాట్లాడారు. కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో మారేడుబాక సర్పంచ్ గోవింద రాజులు, బీజేపీ పార్లమెంటరీ నియోజకవర్గ ఇంచార్జి పొట్లూరి రామ్మోహనరావు, నియోజకవర్గ కన్వీనర్ కోటిపల్లి వీవీ సాయిరామ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందం, జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ పాల్గొన్నారు.

సాబ్జీ ఆశయ సాధనే ఆయనకు నివాళి

కపిలేశ్వరపురం: పీడీఎఫ్ ఎమ్మెల్సీ, ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాణ కర్త షేక్ సాబ్జీ ఆశయ సాధనకు కృషి చేయడమే ఆయనకు సరైన నివాళి అని యూటీఎఫ్ జిల్లా కుటుంబ సంక్షేమ పథకం అధ్యక్షుడు డీవీ రాఘవులు అన్నారు. అంగర జెడ్పీ హైస్కూల్‌లో శనివారం సాబ్జీ సంతాప సమావేశం నిర్వహించారు. యూటీఎఫ్ మండల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు జువ్వల శ్రీనివాస్, ఇల్లూరి సూరిబాబు మాట్లాడుతూ సామాజిక సమస్యల పరిష్కారానికి సాబ్జీ పాటుపడ్డారన్నారు. ఆయన మృతి ఉపాధ్యాయ ఉద్యమానికి తీరని లోటని సంఘ జిల్లా కార్యదర్శి పెయ్యల సురేంద్ర, నాయకులు ఎంవీ రమణారావు అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎంలు అంగర రాజు, ఎంవీ ప్రసాద్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఆర్ ట్రస్టు సేవలు ప్రశంసనీయం

కపిలేశ్వరపురం: అర్తమూరుకు చెందిన ఎస్‌బీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దూలం పద్మ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు అన్నారు. అర్తమూరులో శనివారం నిర్వహించిన 166వ ఉచిత హోమియో శిబిరం, ట్రస్ట్ 28వ వార్షికోత్సవ కార్యక్రమాలకు వారు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లబ్ధిదారుకు ఎస్‌బీఆర్ ట్రస్టు సమకూర్చిన ఉచిత కుట్టుమెషీన్‌ను అందజేశారు. వారు మాట్లాడుతూ 28 ఏళ్లుగా హోమియో వైద్య శిబిరాలను నిర్వహిస్తున్న ట్రస్టు చైర్మన్ సత్తి బుల్లిస్వామిరెడ్డి సేవలను కొనియాడారు. అల్లు రామలింగయ్య హోమియో వైద్య కళాశాలకు చెందిన వైద్య నిపుణులు శిబిరంలోని 250 మందికి హోమియో మందులను అందించారు. కార్యక్రమంలో ట్రస్టు డైరెక్టర్ సత్తి సత్యనారాయణ రెడ్డి, వైస్ చైర్మన్ సత్తి లక్ష్మణ్ రెడ్డి, ట్రస్ట్ కన్వీనర్లు కోనాల సత్తిరెడ్డి, తాడి కోదండ రామారెడ్డి పాల్గొన్నారు.



లబ్ధిదారుకు కుట్టుమెషీన్‌ను అందిస్తున్న పద్మ, వెంకన్న దంపతులు, చిత్రంలో బుల్లిస్వామిరెడ్డి

ఈవీఎంల వినియోగంపై అవగాహన

రాయవరం: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ద్వారా ఓటు వేసే విధానంపై రెవెన్యూ అధికారులు శనివారం అవగాహన కల్పించారు.ని వెదురుపాక సచివాలయంలో తహసీల్దారు కేజే ప్రకాష్‌బాబు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అవగాహన కల్పిస్తున్నట్టు తహసీల్దారు తెలిపారు. మండలంలోని 53 పోలింగ్ కేంద్రాల పరిధిలో నూతన ఓటర్లకు, వృద్ధులకు ప్రధానంగా అవగాహన కల్పించనున్నట్టు చెప్పారు. ఎలక్టోరల్ అధికారి కె.ప్రభాకర్ ఈవీఎం పనిచేసే విధానాన్ని, వివరించారు. సర్పంచ్ మల్లిడి సూరారెడ్డి, ఎంఈఓ పి.రామలక్ష్మణమూర్తి, ఆర్ఐ పంపన రామారావు, వీఆర్ఓలు పాల్గొన్నారు.



వెదురుపాకలో ఈవీఎం వినియోగంపై అవగాహన కల్పిస్తున్న రెవెన్యూ అధికారులు

విద్యుత్ పొదుపు భవిష్యత్తుకు వెలుగు

కపిలేశ్వరపురం: విద్యుత్‌ను పొదుపుగా వినియోగించుకోవడం ద్వారా భవిష్యత్తు తరాలవారికి వెలుతురును ప్రసాదించవచ్చని అంగర విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈ షాలేంరాజు అన్నారు. విద్యుత్ వారోత్సవాల్లో భాగంగా శనివారం వెదురుమూడి ప్రాథమికోన్నత పాఠశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు ఏఈ షాలేంరాజు బహుమతులను అందజేశారు. విద్యుత్తును పొదుపుగా వాడుకుంటే మంచిదన్నారు.



వెదురుమూడిలో విద్యార్థులకు బహుమతి ఇస్తున్న ఏఈ

బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడిగా శాకా



శాకా బాలసుబ్రహ్మణ్యం

రామచంద్రపురం రూరల్: భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం) జిల్లా ఉపాధ్యక్షుడిగా రామచంద్రపురం మండలం ద్రాక్షారామకు చెందిన శాకా బాలసుబ్రహ్మణ్యం నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు కొండేటి ఈశ్వర్‌గౌడ్ నియామక ఉత్తర్వులు పంపించారు. బాలసుబ్రహ్మణ్యం తన నియామకానికి సహకరించిన బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీవేమా, రామచంద్రపురం నియోజకవర్గ కన్వీనర్ దూడల శంకరనారాయణలకు కృతజ్ఞతలు తెలిపారు.